క్లుప్తంగా

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

గుంతకల్లుటౌన్: బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. పై డిమాండ్‌పై ఈ నెల 11న అనంతపురం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు ప్రజలు తరలిరావాలని కోరారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో ఈ ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. బీసీ సంఘం నాయకులు మాచర్ల ఎల్లప్ప, రాధాకృష్ణ, మల్లికార్జున, ధనుంజయ, గిరి, సాధిక్, జామిని, నాగవేణి, అరుణ పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి



కిష్టిపాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు

పెద్దవడుగూరు : రావులుడికి, పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, దిమ్మగుడి తదితర గ్రామాల్లో బుధవారం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దవడుగూరు, క్రిష్టిపాడులోని ఫెర్రర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పెద్దవడుగూరులో స్పందించు సాయం అందించు అంటూ హుండీలు చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. సీఓ మంజుల, సీడీసీ మెంబర్లు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా బుధవారం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గార్లదిన్నె ఆర్డీటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు ఫాదర్ ఫెర్రర్ సేవలను కొనియాడారు. ఏటీఎల్ సావిత్రి,సీఓ లక్ష్మీదేవి, కదిరెప్ప, సీబీటీ నరసింహులు, నెట్‌వర్క్ లీడర్ సునీత , ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు టోపీల పంపిణీ



కార్మికులకు టోపీలు అందిస్తున్న కమిషనర్ జబ్బార్ మియా

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సత్యసాయి బాబా సేవా సమితి అధ్యక్షుడు రమణ పారిశుధ్య కార్మికులకు టోపీలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా రమణను అభినందించారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: కొత్తపేట బ్రిడ్జి సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వన్నేదొడ్డి గ్రామానికి చెందిన రంగారెడ్డి పని మీద బైక్‌లో కొత్తపేటకు వెళుతుండగా బైక్ స్కిడ్ అయి కింద పడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని స్థానికుల సమాచారంతో పోలీసులు గుత్తి ఆసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం తీసుకెళ్లారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గార్లదిన్నె: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా పేర్కొన్నారు. మర్తాడు గ్రామానికి రామాంజనేయులు(53) ఈనెల 1న కల్లూరు వైపు నుంచి గార్లదిన్నెకు బైక్‌పై బయలుదేరాడు. కనంపల్లి క్రాస్ సమీపం లోకి రాగానే బైక్‌పై నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాటక సంహార అలంకరణలో శ్రీరాముడు



తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఏటిగడ్డ ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం శ్రీరామచంద్రుడు తాటక సంహార అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగవరోజైన బుధవారం స్వామివారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు.

పేదల ఆకలి కేకలు

- ఏప్రిల్‌లో 13 వేల మంది కార్డుదారులకు బియ్యం కోత
- కోటా పేరుతో కూటమి ప్రభుత్వ నిర్వాకం



పామిడిలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ బియ్యం పంపిణీ(ఫైల్)

పామిడి: కూటమి ప్రభుత్వంలో పేదలకు ఆకలి కేకలు తప్పడం లేదు. కోటా పేరుతో పేదల పొట్టగొడుతోంది. ఏప్రిల్ నెలలో వేలాది మందికి బియ్యం పంపిణీలో కోత విధించింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన 10 నెలలకే తన నిజస్వరూపం బయటపెడుతోంది. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలకు ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతినెలా రేషన్ పంపిణీ చేయాల్సి ఉంది. అయితే కోటా పేరుతో కేవలం 75 శాతం రేషన్‌కార్డులకు మాత్రమే బియ్యం పంపిణీ చేస్తోంది. దీంతో మిగతా కార్డుదారులకు ఆకలబాధలు తప్పని పరిస్థితి కల్పించింది.

25 శాతం మందికి రేషన్ కట్

పామిడి మండలంలో దాదాపు 65 వేల జనాభా, 46 వేల ఓటర్లు, 16 వేల ఇళ్లున్నాయి. అందులో 80 శాతం మంది ప్రజలు పేదలే. కుట్టు, వ్యవసాయం, కుల వృత్తులపై ఆధారపడి జీవించే జనం అధికం. అలాంటిది ఉన్నఫళంగా ప్రభుత్వం రేషన్ బియ్యం కోటా లేదంటూ బియ్యం పంపిణీలో కోత విధించింది. పామిడి మండలానికి సంబంధించి 50 ఎఫ్‌పీ షాపులు, 16 వేలు రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 52 వేల మంది లబ్ధిదారులు ఉన్నారు. కోటా పేరుతో ఏప్రిల్ నెలకు సంబంధించి 39 వేల మందికి మాత్రమే రేషన్ బియ్యం సరఫరా చేశారు. దీంతో దాదాపు 13 వేల మంది లబ్ధిదారులకు బియ్యం పంపిణీలో కోత విధించారు.

రేషన్ కోత సరికాదు



పామిడి మండలంలో 65 వేల జనాభాలో 52 వేల మంది దాకా పేదలే. అందులో కేవలం ఏప్రిల్ రేషన్ కోటాను 39 వేల మందికి మాత్రమే వర్తింపజేశారు. మిగతా 13 వేల మంది పేదలకు ఆకలి మిగల్చడం ఎంతవరకూ సమంజసం. ప్రభుత్వం కార్డుదారులందరికీ రేషన్ పంపిణీ చేయాలి.

–పీ అనిమిరెడ్డి, సీపీఎం సీనియర్ నేత, పామిడి

అందరికీ పంపిణీ చేయాలి



ఏప్రిల్‌లో కోటా పేరుతో కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయకపోవడం దారుణం. రేషన్‌కార్డుదారులంతా పేదలే. కూలీనాలి చేసుకుని జీవించే వారికి ఉన్నఫలంగా బియ్యం పంపిణీ నిలిపేస్తే ఎలా? ప్రభుత్వం కార్డుదారులందరికీ రేషన్ పంపిణీ చేయాలి.

–కే రహీమ్, సీపీఐ సీనియర్ నేత, పామిడి.

రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి



ఏప్రిల్‌కు సంబంధించి రేషన్ బియ్యం కోటా కేటాయింపు రాష్ట్ర వ్యాప్తంగా తక్కువగా వచ్చింది. దీంతో ఎండీయూ వాహనదారులకు ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాల ప్రాంతాల్లో రేషన్ బియ్యం అందించాలని ఆదేశించాం. పామిడి మండలానికి సంబంధించి 16 వేల తెల్లరేషన్‌కార్డుదారులకు గాను 4 వేల మంది ఈ కేవైసీ పెండింగ్ ఉంది. ఈకేవైసీని డీలర్లు గడువులోపు పూర్తి చేసేలా చర్యలు చేపడతాం.

–ఎస్.శ్రీధరమూర్తి, తహసీల్దార్, పామిడి

పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి



కట్టెల పొయ్యిపై వంటచేస్తూ నిరసన తెలుపుతున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పేద ప్రజలపై పెనుభారాన్ని మోపేలా కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్‌పై పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, ఐద్వా పట్టణ కార్యదర్శి రంగమ్మ డిమాండ్ చేశారు. గ్యాస్ ధరను పెంచడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన తెలియజేశారు. నిత్యావసర ధరలు, వివిధ రకాల చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమన్నారు. వంట గ్యాస్‌పై పెంచిన రూ.50 ధరను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎన్డీఏలో భాగస్వామైలైన టీడీపీ, జనసేన కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ధరలను ఉపసంహరించుకునేలా చూడాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఐద్వా అధ్యక్షురాలు బి.జ్యోతి, సీపీఎం నేతలు నాగరాజు, సురేంద్ర, రాము నాయక్, లక్ష్మీబాయి, షాకీరా, సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పెంచిన గ్యాస్ , పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు, కార్యకర్తలు బుధవారం గుత్తిలోని గాంధీ సర్కిల్ వద్ద ఖాళీ గ్యాస్ సిలిండర్లతో ధర్నా చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, మహిళా సంఘం మండల కార్యదర్శి రేణుక మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధరలను తగ్గించే వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు బాలగిరి, రేవతి, కవిత, అశోక్, కృష్ణవేణి, శృతి పాల్గొన్నారు.

పామిడి: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు అన్యాయమని ఏపీ హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన ధరను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేష్, రామకృష్ణ, ధరణి కుమార్, భాస్కర్‌రెడ్డి, మణికంత, చంటి బాబు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



రైల్లో తన ఊరికి వెళ్తున్న అలీహైదర్‌ఖాన్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణ పోలీసులు మానవత్వం చాటుకున్నారు. ప్రజలపై దాడికి పాల్పడుతున్న మతిస్థిమితం సరిగాలేని వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్నానం చేయించి దుస్తులు వేసి తన సొంతూరుకు సాగనంపారు. వివరాలు.. బుధవారం ఉదయం పట్టణంలోని సీబీ రోడ్డులో ఓ బిల్డింగ్ పైన మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి ఉండటంతో అతన్ని కిందకు దించే క్రమంలో స్థానికులు అతన్ని బెదిరించారు. దీంతో ఆ వ్యక్తి ఏకంగా పైనుండి రాళ్లు రువ్వుతూ స్థానికులతోపాటు రోడ్డుపై వెళ్లే వ్యక్తులను భయభ్రాంతులకు గురిచేశాడు. చేసేదిలేక స్థానికులు పోలీసులకు తెలపడంతో వారు స్థానిక యువకుల సాయంతో అతన్ని పట్టుకొని కిందకు దించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి స్నానం చేయించి దుస్తులు వేసి భోజనం పెట్టించారు. అతడి వివరాలు ఆరా తీయగా తన పేరు అలీ హైదర్‌ఖాన్ అని, తనది కర్ణాటక తుముకూరు జిల్లా హుస్సేన్‌పురం అని చెప్పడంతోపాటు భార్య, పిల్లలు వివరాలను తెలియజేయడంతో రైల్లో అతన్ని ఊరికి పంపారు.

సంక్షిప్త సమాచారం

ఇన్‌చార్జ్ తహసీల్దారుగా శేషారెడ్డి

యల్లనూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పుట్లూరు తహసీల్దార్ శేషారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జూదరుల అరెస్ట్

యల్లనూరు: వెన్నపూసపల్లి గ్రామ సమీపంలో పేకాట కేంద్రంపై బుధవారం రాత్రి ఎస్ఐ రామాంజనేయరెడ్డి మెరుపుదాడులు చేశారు. ఈ దాడుల్లో ఎనిమిది మంది పేకాటరాయుళ్లతో పాటు రూ.57 వేల నగదు, ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపనున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బీరు బాటిళ్లు సీజ్

తాడిపత్రి రూరల్: యల్లనూరు మండలం గొడ్డుమర్రి వద్ద కారుతోపాటు 72 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నాయుడు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కడప జిల్లా దిగువ లింగాల గ్రామానికి చెందిన ఆనంద్‌రెడ్డి నిబంధనలకు అతిక్రమించి కడప జిల్లా నుంచి ఎక్కువ మొత్తంలో బీరు బాటిళ్లను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యల్లనూరు: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్ఐ రామాంజనేయరెడ్డి, వైద్యులు లోకేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం యల్లనూరులో మాదక ద్రవ్యాతలో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. యువత చెడు దారి పట్టకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ , ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

8 రోజుల పాటు విద్యుత్ అంతరాయం

గుత్తి: పట్టణంలో గురువారం నుంచి 8 రోజుల పాటు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ డీఈ పిళ్లై తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 10,11వ తేదీల్లో ఉదయం 7.30 గంటల నుంచి 1 గంటల వరకు, 12వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు, 13,14,15 తేదీల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 16,17 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. 220 కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

తాడిపత్రి రూరల్: తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఈనెల 11వ తేదీ మధ్యాహ్నం 1 గంట నుంచి 12వ తేదీ రాత్రి 8 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రభాకర్‌రావు బుధవారం తెలిపారు. వినియోగదారులు గమనించాలని సూచించారు.

'ఉపాధి' పనులను వేగవంతం చేయండి

పుట్లూరు: ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ అలివేలమ్మ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె ఏపీఓ నరేంద్రతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేసవి సందర్భంగా పని ప్రదేశంలో నీడ ఏర్పాటు చేయించాలన్నారు. వడ దెబ్బకు గురికాకుండా కూలీలకు అవగాహన కల్పించాలన్నారు.

శిథిలావస్థలో ఉన్న విగ్రహాన్ని తొలగించండి

బుక్కరాయసముద్రం: తహసీల్దార్ కార్యాలయంలో శిథిలావస్థకు చేరుకున్న అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాలని జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు, బీకేఎస్ సర్పంచ్ పార్వతి పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల అనంతపురం తాడిపత్రి రహదారి పక్కన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. అయితే తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎలాంటి కార్యక్రమాలకు నోచుకోవడం లేదన్నారు. అంబేడ్కర్ గౌరవానికి భంగం కల్గకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ముస్లింలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండ



దీక్షల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదల రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: ముస్లింలకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనుదల రమేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బందామసీదు వద్ద ముస్లింలు వక్ఫ్ సవరణ చట్టం వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షకు బుధవారం ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టం బిల్లును వైఎస్సార్‌సీపీ వ్యతిరేకిస్తోందన్నారు. అనంతరం ఆయన ముస్లింలకు మద్దతుగా నినాదాలు చేశారు.

తాడిపత్రి రూరల్: పట్టణంలోని సిద్దిబాషా దర్గా వద్ద వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు మైనార్టీ నాయకులు మున్నా, అయూబ్‌బాషా మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

నిరుద్యోగ భృతి చెల్లించేలా చూడాలని వినతి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందిస్తున్న గ్రామీణ పౌరసేవాసమితి సభ్యులు

గుంతకల్లు రూరల్: ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించే చూడాలని గ్రామీణ పౌరసేవా సమితి సభ్యులు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. స్వయం ఉపాధికి సంబంధించి ప్రభుత్వం సబ్సిడీ రుణాల యూనిట్లను పెంచి అర్హులందరికీ అందేలా చూడాలని కోరారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన స్వామివారి నివేదనలకు అవసరమైన వస్తువులు, ఇతరత్రా సరుకుల కొనుగోలుకు రూ.లక్ష చెక్కును ఆలయ ఏఈవో వెంకటేశులుకు అందజేశారు.

సీతారామాలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాలయంలో వైఎస్సార్ సీపీ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరి సాంబశివారెడ్డి, నాయకులు ఆలూరి రమణారెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరి సాంబశివారెడ్డి రూ.30 లక్షల విరాళం అందించిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఆలయంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, కలశారాధన, కలశ ప్రతిష్ఠ, చేపట్టారు. శుక్రవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

రాష్ట్రస్థాయి గ్రాండ్ ఒలింపియాడ్‌లో ప్రతిభ



బాబా ఫరీద్



సాంగత్య

గుత్తి: గుంటూరులో ఈ–అబ్యాస్ ఐఐటీ అకాడమీ నిర్వహించిన బీవీవీఎస్ రాష్ట్ర స్థాయి గ్రాండ్ ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో గుత్తి కి చెందిన కెప్టెన్ కెకె స్వామి పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో బాబా ఫరీద్(రెండవ తరగతి) ఫస్ట్ ర్యాంకు, సాంగత్య (8వ తరగతి) సెకండ్ ర్యాంక్ , హర్షిత, షనయ ఐశ్వర్య,చిన్మయ (1వ తరగతి) స్టేట్ 7వ ర్యాంకు సాధించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో కెప్టెన్ కెకె స్వామి పాఠశాల ఒలింపియాడ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డు సాధించింది. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ నిర్మలా స్వామి, డైరెక్టర్ చైతన్య ,ఉపాధ్యాయులు అభినందించారు.

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

శింగనమల: పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 16 వరకూ జరిగే కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వహకుడు భాను ప్రకాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం శంకర నేత్రాలయం వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మొబైల్ వాహనంలో ఆపరేషన్లు చేస్తారని భాను ప్రకాష్‌రెడ్డి తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పుట్లూరు: పౌష్టికాహారంతో గర్భిణులకు ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తెలిపారు. బుధవారం ఆమె జంగంరెడ్డి పేట అంగన్‌వాడీకేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాలకు హాజరయ్యారు.

తెలుగు తమ్ముడి బరితెగింపు

- గ్రామకంఠ స్థలం కబ్జాకు యత్నం
- పంచాయతీ బోరు తొలగింపు



తెలుగు తమ్ముడు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న ఖాళీ స్థలం ఇదే (ఇన్‌సెట్‌లో) చేతిపంపును తొలగించిన దృశ్యం

తాడిపత్రి: అధికారంలో ఉన్నది తమ ప్రభుత్వం, ఏం చేసినా అడిగేవారు లేరన్న ధీమాతో ఓ తెలుగు తమ్ముడు ఏకంగా గ్రామ కంఠస్థలాన్ని కాజేసే ప్రయత్నం చేయడంతో పాటు, అందులో ఏర్పాటు చేసిన చేతి పంపును తొలగించాడు. దీనిపై అటు రెవెన్యూ, ఇటు పంచాయతీ అధికారులు ఎలాంటి ఫిర్యాదు పోలీసులకు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. తాడిపత్రి మండలం ఇగుడూరు గ్రామంలోని సర్వే నంబర్ 306 గ్రామ కంఠంగా ఉంది. అయితే అందులో దాదాపు సెంటు స్థలంలో పుల్లన్న అనే 30 ఏళ్ల క్రితం ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నాడు. అందుకు సంబంధించి పంచాయతీకి ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు అతడి పేరు మీదనే వస్తున్నాయి. అతడి ఇంటి పక్కనే దాదాపు 2 సెంట్ల మేర ఖాళీ గ్రామ కంఠం స్థలం ఉంది. అందులో ఓ మూలన పంచాయతీ చేతి బోరు పంపు ఉంది. 2 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ గ్రామ కంఠం స్థలం వెనుక వైపు ఉన్న గృహాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారిగా ఉంటోంది.

కబ్జా చేసేందుకు తెలుగు తమ్ముడి ప్రయత్నం...

గ్రామానికి చెందిన తెలుగు తమ్ముడు బోయ వారాది అనే వ్యక్తి ఎలాగైనా గ్రామ కంఠం స్థలాన్ని ఆక్రమించాలన్న ఉద్దేశంతో సదరు పుల్లన్న నిర్మించుకున్న ఇంటి నిర్మాణం స్థలంతో కలిపి మిగిలిన దాదాపు 2 సెంట్ల ఖాళీ స్థలం తమ పూర్వీకులదని, తనకు ఆయా స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాల్సిందిగా గతంలో తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చాడు. కానీ బుధవారం ఉదయం తన బంధువులు బాల మద్దిలేటి, మరి కొందరితో కలసి దౌర్జన్యంగా ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన చేతి పంపును తొలగించి, స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. అంతేకాక గత 30 ఏళ్లగా నివాసం ఉంటున్న పుల్లన్న ఇల్లు కూడా తమదేనని, అందుకు సంబంధించిన పట్టా తమ వద్ద ఉందని బెదిరించారు. మరో వైపు స్థలాన్ని బోయ వారాది ఆక్రమిస్తే తమ ఇళ్లకు వెళ్లేందుకు కనీసం రస్తా కూడా ఉండదని గ్రహించిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకుని, రెవెన్యూ కార్యాలయంలో అధికారుల సమక్షంలో సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు.

తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం

గ్రామంలోని సర్వే నంబర్ 306 తమ రెవెన్యూ రికార్డులో గ్రామ కంఠంగా ఉంది. బోయ వారాది అనే వ్యక్తి సదరు స్థలం తనదని, తమ తండ్రి పేరిట గ్రామ కంఠం స్థలం దాదాపు 3 సెంట్లకు అడంగల్ ఉందని చెబుతున్నారు. ఘటనపై తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– దిలీప్ కుమార్‌రెడ్డి, వీఆర్వో

యువతి అదృశ్యం

గార్లదిన్నె: పెనకచెర్లకు చెందిన ఓ యువతి అదృశ్యమైంది. ఎస్ఐ గౌస్ మహమ్మద్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాశీ మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆస్తి కోసం ఘర్షణ: ఇద్దరికి గాయాలు

గుత్తి: ఆస్తి తగదా విషయమై జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు..మిడుతూరుకు చెందిన శంకరయ్య అనగానదొడ్డికి చెందిన ఈయన అన్న కుమారుడు గజేంద్ర మధ్య గత కొంత కాలంగా వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గజేంద్ర గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శంకరయ్యకు కనిపించాడు. ఇద్దరూ గొడవ పడ్డారు. రాళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడుల్లో శంకరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గజేంద్ర స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు ఇద్దరినీ స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.